
ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా శంకరరావు, లక్ష్మణరావు

ప్రజాశక్తి పాలకొండ

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పాలకొండకు చెందిన బౌరోతు శంకర్రావు, కొమరాడకు చెందిన డి.లక్ష్మణ రావు ఎంపికయ్యారు. టీచర్స్ డే సందర్భంగా వీరు ఈ అవార్డు అందుకోనున్నారు. శంకరరావు పాలకొండలోని ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. లక్ష్మణరావు కొమరాడ గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరి ఎంపిక పట్ల ఆయా పాఠశాలల సిబ్బంది, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.



లక్ష్మణరావు



శంకరరావు

ఉచిత బస్సు... కార్మికుల పస్తు

- పూట గడవడమే కష్టం
- స్త్రీశక్తి అమలుతో ఆటో డ్రైవర్ల అవస్థలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రభుత్వం స్త్రీలకు ఉచిత బస్సు పథకాన్ని ఆగస్ట్ 15 నుంచి అమలు చేయడంతో ఆటోలతో జీవనం సాగిస్తున్న డ్రైవర్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. కిరాయిలు లేక స్టాండల్లో కదలకుండా ఉన్న ఆటోలు మరోపక్క, అప్పులు చేసి కొన్న ఆటోలకు కిస్తీలు కట్టకుండా ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. గతంలో కరోనా సమయంలో కూడా ఇన్ని ఇబ్బందులుపడలేదని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో ఆటో నడుపుకుంటున్న లక్షలాది మంది నిరుద్యోగ యువత పరిస్థితి దారుణంగా తయారైంది. ఉమ్మడి జిల్లాలో 20 వేల మంది వరకు ఆటోలతో జీవనం గడుపుతున్న కార్మికులకు, ఇదే రంగంపై పరోక్షంగా మరో 8 వేల మంది కార్మికులకు పూట గడవడం గగనంగా మారింది. ప్రభుత్వాలు చదువుకున్న యువతకు ఉపాధి కల్పించకపోవడం, పారిశ్రామిక రంగం అభివృద్ధి చేయకపోవడంతో కొందరు సొంత డబ్బుతోను, ఎక్కువ మంది ఫైనాన్స్ కంపెనీల్లో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఆటోలను, క్యాబ్ లను కొనుగోలు చేసుకొని చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను పోషించుకొంటున్న ఈ రంగంపై ఆధారపడ్డారు. ప్రభుత్వం ఒక్క నిర్ణయంతో వీరంతా రోడ్డున పడ్డారు.



కిరాయిలు రాక స్టాండ్‌లో ఖాళీగా ఉన్న ఆటోలు

ఓలా, ఉబర్ తో ఇప్పటికే కష్టమైన జీవనం

గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలైన ఓలా, ఉబర్ సంస్థలకు అనుమతులు ఇవ్వడంతో అవి ఎక్కడపడితే అక్కడ చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని పట్టణాల్లోనూ, చివరకు పల్లెటూర్లలో ప్రవేశించడంతో పనులు లేకుండా రోజుకు చాలీచాలని ఆదాయంతో జీవితం నెట్టుకువస్తున్న ఆటో కార్మికులపై ప్రభావం పడింది. ఇప్పుడు స్త్రీ శక్తి పథకంతో ఉన్న కిరాయిలు లేక జీవనం రోడ్డునపడింది.

వాహన మిత్ర ఊసు లేదు... సంక్షేమ బోర్డు జాడ లేదు..

గత వైసిపి ప్రభుత్వ హయాలో ఆటో కార్మికులకు ఏడాదికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున వాహమిత్ర పథకం కింద అందజేసింది. ఎన్నికలకు ముందు కూటమి నాయకులకు ప్రతి కార్మికుడికి ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి నేటికీ 15 నెలలు వచ్చినా నేటికీ దాని ఊసే లేదు. నారా లోకేష్ పాదయాత్రలో ఆటో రంగంపై ఆధారపడిన కార్మికులందరిరీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, అన్ని విధాలా ఆదుకొంటామని ఇచ్చి హామీ అమలు చేయలేదు సరికదా, దాని గురుంచి ఏ నాయకుడు నోరు మెద పడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు పథకానికి వ్యతిరేకం కాదు

ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదని, ఈ పథకం అమలు చేసే ముందు ప్రభుత్వం కార్మికులతో చర్చించకుండా బాధ్యతారహితంగా వ్యవహరించిదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పథకం అమలు వల్ల ఇదే రంగంపై కొన్ని లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తుంచక పోవడం, నష్టపోతున్న ఆటో కార్మికులకు న్యాయం చేయక పోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయం చూపాలి



స్త్రీ శక్తి పథకానికి ఎవరూ వ్యతిరేకం కాదు. అలాగని ఇదే రంగంపై ఆధారపడి బతుకుతున్న కార్మికులకు అన్యాయం చేస్తుంటే కార్మిక సంఘాలు ఊరుకోవు. వీరికి ప్రత్యాయామం చూపించే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లైసెన్స్ ఉన్న ప్రతి కార్మికునికి రూ.20 వేలు చొప్పున వాహన మిత్ర పథకం ద్వారా అందజేయాలి. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాలుగా లబ్దిచేకూర్చేలా కృషి చేయాలి.

ఎన్‌వై నాయుడు,
సిఐటియు జిల్లా కార్యదర్శి

కార్మికులను ఆదుకోకపోతే మరణమే



ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. గత 20ఏళ్లుగా ఇదే ఉపాధిగా చేసుకొని బతుతున్నాం. పిల్లల చదువులు మధ్యలోనే ఆగిపోయే పరిస్థితి ఉంది. రోజు వారీ కిరాయిలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో కుటుంబం పూట గడవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కార్మికులకు ప్రత్యామయంగా ఏదైనా చేయకపోతే రాబోయే రోజులు దుర్భరం. భవిష్యత్తును తలుచుకొంటేనే భయంగా ఉంది. ప్రభుత్వం వెంటనే కార్మికుల సంక్షేమం గురించి పట్టించుకోకపోతే మరణాలే శరణ్యం.

ఎరుబోతు అప్పల రాజు,
ఆటో యూనియన్ నాయకులు, సాలూరు.

కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి



ఎన్నో ఏళ్ళుగా ఇదే వృత్తిగా ఎంచుకొని జీవనం గడుపుతున్నాం. దీని ద్వారా వచ్చే ఆదాయంతో పిల్లలను చదివించుకొంటూ బతుకుతున్నాం. అటువంటి సమయంలో ప్రభుత్వం ఏకపక్షంగా ఈ పథకం అమలుతో ఆటో కార్మికులకు తీవ్ర అన్యాయం చేసింది. ఈ పరిస్థితుల్లో కార్మికులు బయట పడాలంటే ప్రభుత్వమే సరైన నిర్ణయం తీసుకొని ఆదుకోవాలి.

జర్జాపు జ్యోతీష్‌రావు,
ముంగరమ్మతల్లి ఆటో యూనియన్ అధ్యక్షులు, మామిడిపల్లి.

కుక్క కాటుకు గురైన బాలుడు మృతి

నాలుగేళ్ల బాలుడు..చూడగానే ముద్దొచ్చే రూపం..చలాకీగా తిరుగుతుంటే ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు. 15రోజుల క్రితం ఓ శునకం అమాంతం మీదపడి గుండెపై గాయం చేసింది. అయినా ఆ చిన్ని గుండె తట్టుకొని ధైర్యంగా నిలబడింది. ఆస్పత్రిలో వైద్యం పొంది ఆ బాలుడు తేరుకున్నాడు. వినాయక చవితి వేడుకల్లో సందడంతా తనద అన్నట్లు డాన్సుచేస్తుంటే తల్లిదండ్రులతో పాటు ఆ వీధిలో ఉన్నవారంతా మురిసిపోయారు. అంతలోనే రెండు రోజులుగా చిన్నారిలో ఒకటే భయం.. నీరు చూసినా, శబ్దం విన్నా వణికపోతుండేవాడు. గమనించిన తల్లితండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లేసరికే ఆ పసివాడి ఊపిరి ఆగిపోయింది. హృదయ విదాకరమైన ఈ ఘటన పార్వతీపురం పట్టణంలో మంగళవారం చేసుకుంది.

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని కొత్తవలస మణికంఠ కాలనీలో గల ఓ బాలుడు కుక్క కాటుకు గురై మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మణికంఠ కాలనీకి చెందిన గవర లోహిత్(4)ను గత నెల 16న ఇంటి నుంచి బయటకు వచ్చిన సమయంలో వీధి కుక్క దాడి చేసి ఛాతిపై కరిచింది. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్సను అందించారు. తర్వాత గాయాల నుంచి కోలుకున్నాడు. అనంతరం వినాయక చవితి ఉత్సవాల్లో తండ్రితో కలిసి హుషారుగా నృత్యం చేసి పలువుర్ని ఉత్తేజపరచడం విశేషం. రెండు రోజుల క్రితం నుంచి శబ్దం విన్నా, నీటిని చూసినా భయంతో వణికిపోవడం కుటుంబ సభ్యులు గమనించగా, మంగళవారం ఒక్కసారిగా తీవ్ర అనారోగ్యానికి గురవడంతో కుటుంబ సభ్యులు కంగారుపడి ఆసుపత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో బాలుడు మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు రవళి, ఈశ్వరరావుల దుఃఖం వర్ణనాతీతం. ఆ తల్లిదండ్రుల ఓదార్చడం ఎవరి తరం కాలేదు. బాలుడు మృతదేహాన్ని చూసేందుకు కొత్తవలసలో స్థానిక ప్రజలు బారులు తీరారు.



తండ్రి తో కలసి డాన్స్ చేస్తున్న లోహిత్
(ఇన్‌సెట్‌లో కుక్క దాడిలో గాయపడ్డ లోహిత్)

ఎమ్మెల్యే పరామర్శ

కుక్క కాటు గురై మృతి చెందిన బాలుడు లోహిత్ తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను బుధవారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. స్థానికులు పట్టణంలో కుక్కలు అధికంగా ఉండి పలువుర్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పడంతో, వాటి నివారణకు సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

బంగారిదొర కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయాలి
కలెక్టరుకు ఎపి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని వెలగవలస చెరువును గ్రానైట్ బూడిదతో నింపేసి, గ్రానైట్ కంపెనీ పాడి బంగారిదొరను చంపేసిందని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బంగారి దొర కుటుంబానికి రూ.50లక్షలు పరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాదుకు ఎపి రైతు సంఘం నాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ చేపల వేటకు వెళ్లిన బంగారి దొరను చంపేసింది చెరువు కాదని, గ్రానైట్ కంపెనేనని వాపోయారు. బడిదేవరకొండను గ్రానైట్ చేయడం వల్ల టన్నులకు టన్నులు రాయి బూడిద వస్తుందని, వర్షాలకు అది నీటితో కిందన ఉన్న చెరువుకు చేరిందని, అది చెరువులో మేట పడిందని, ఇది తెలియక చెరువులో దిగిన బంగారిదొర చనిపోయాడని, ఇది ముమ్మాటికీ గ్రానైట్ కంపెనీ చేసిన హత్యేనని తేల్చి చెప్పారు. బడిదేవరకొండపై గ్రానైట్ చేయడానికి లైసెన్స్ ఇవ్వడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనన్నారు. అందులో గ్రానైట్ ఎక్కడ చేస్తారో, బండలను ఎక్కడ వేస్తారో, వచ్చే వ్యర్థాలు బూడిద, చిన్నచిన్న రాయి ముక్కలు ఎక్కడ వేస్తారో ఇవన్నీ ప్లానింగ్లో ఉంటాయని, ఇలా చెరువుల్లోకి వదిలేయడం తీవ్రమైన నేరమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర మైనింగ్ డిపార్ట్మెంట్ లైసెన్స్ ఇవ్వడం ఒక నేరమైతే వచ్చే వ్యర్థాలు ఎక్కడవేస్తున్నాడో కూడా కళ్లు మూసుకోవడం మైనింగ్ డిపార్ట్మెంట్ చేసిన ఘోరమైన వైఫల్యమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో స్పందించి చనిపోయిన బంగారిదొర కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం గ్రానైట్ కంపెనీ ఇవ్వాలని, ఈ కంపెనీపై క్రిమినల్ కేసు నమోదు చేసి యజమానిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రానైట్ అక్రమ లైసెన్స్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు పాల్గొన్నారు.



వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే విజయచంద్ర, అధికారులు

బ్రెయిన్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా ఆసుపత్రిలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర బుధవారం ప్రారంభించారు. నీతి ఆయోగ్ ప్రాజెక్ట్ బృందం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా బ్రెయిన్ హెల్త్ క్లినిక్ కార్యక్రమాన్ని ప్రసారం చేసి కార్యాచరణ అంశాలపై వివరించారు. జిల్లా ఆసుపత్రి నుంచి కలెక్టర్, ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ అధికారులు ఈ ఆన్లైన్ ప్రజెంటేషన్‌ను వీక్షించారు. బ్రెయిన్ హెల్త్ క్లినిక్ లో అందుబాటులోకి రానున్న సేవలపై జిల్లా ఆసుపత్రి వైద్య బృందంతో వారు చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక జీవన ప్రపంచంలో మానవుని జీవనశైలి విధానాలు క్రమేణా పలు మానసిక రుగ్మతలు, ఒత్తిడులకు దారి తీస్తున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, నాడీ వ్యవస్థకు సంబంధించిన సమస్యల్లో మైగ్రేన్ (పార్శ్వ బాధ) కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని, అలాగే ఎపిలిప్సీ (ఫిట్స్), ఆటిజం, డిప్రెషన్‌కు లోనవ్వడం మొదలగు మానసిక సమస్యలు రోజు రోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలు అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. ముఖ్యంగా పార్వతీపురం మన్యం లాంటి ఆశావహు జిల్లాకు బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలు ఎంతగానో అవసరం ఉందని ఇక్కడ నెలకొన్న గిరిశిఖర, మారుమూల గ్రామీణ, సరిహద్దు గ్రామాలు, ప్రజల జీవన ప్రమాణాలు దృష్టిలో ఉంచుకొని మన జిల్లాకు బ్రెయిన్ హెల్త్ క్లినిక్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నందున జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ నాగభూషణరావు, ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహనరావు, సూపరిండెంటెంట్ డాక్టర్ నాగశివజ్యోతి, సైకియాట్రిస్ట్ డాక్టర్ రష్మిత, వైద్యాధికారులు డాక్టర్ శ్యామల, డాక్టర్ కౌశిక్, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 887 టన్నుల యూరియా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 887 టన్నుల యూరియా ప్రస్తుతం అందుబాటులో ఉందని కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వీటిలో 699 ఉన్నల యూరియా రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో 22 రైతు సేవా కేంద్రాలకు 252 టన్నుల యూరియాను మార్క్ ఫెడ్ బఫర్ ద్వారా తరలించినట్లు చెప్పారు. ఇందులో కొమరాడ మండలానికి 30 టన్నులు, సీతంపేటకు 20, కురుపాంకు 32, సాలూరుకు 12 టన్నులు పంపినట్లు చెప్పారు. జి.ఎల్.పురంకు 30, జియ్యమ్మవలసకు 40, గరుగుబిల్లికి 10, సీతానగరం, మక్కువ, బలిజిపేట, పార్వతీపురం మండలాలకు 12 టన్నులు చొప్పున పంపినట్లు తెలిపారు. గురువారం నుంచి గంగవరం పోర్ట్ నుంచి 280 టన్నుల యూరియా ఐపిఎల్ కంపెనీ ద్వారా రైతు సేవా కేంద్రాలకు సరఫరా కానున్నట్లు చెప్పారు. కోరమాండల్ నుంచి 323 టన్నుల యూరియా ఈనెల 4,5 తేదీల్లో జిల్లాకు రానుందని, ఈనెల 15 లోగా మరో 1500 టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం 1341 టన్నుల డిఎపి, 1332 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 647 టన్నుల పొటాష్, 905 టన్నుల సూపర్ ఫాస్ఫేట్ ఎరువులు రైతులకు సరిపడా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. మార్క్ఫెడ్ వద్ద 362 టన్నుల డిఎపి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎరువుల కొరకు కాల్ సెంటర్

ఎరువుల విషయంలో సమస్యలు తెలియజేసేందుకు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. రైతులు 94401 04317, 79894 34766 నెంబర్లకు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చని అన్నారు.

జాబ్‌మేళాలో 77 మంది ఎంపిక

పార్వతీపురంటౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని స్థానిక బైపాస్ రోడ్‌లో శ్రీ సాయి రామ్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో బుధవారం జాబ్ మేళాను నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళాకు 10 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. 210 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 77 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా విచేసిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రభుత్వం మరిన్ని జాబ్ మేళాలు నిర్వహిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీ సాయి రామ్ డిగ్రీ కాలేజీ కరెస్పాండెంట్ రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ డైరెక్టర్ గొట్టపు తవిటినాయుడు, అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కంచిబాబు, ప్లేస్మెంట్ అధికారి ఎన్. మనోజ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో చర్చలు సఫలం

తాత్కాలికంగా విరమించిన రిలే నిరాహార దీక్షలు
ఎపి అంగనాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెల్లడి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే దీక్షలు తాత్కాలికంగా విరమిస్తున్నామని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి తెలిపారు. బుధవారంతో మూడో రోజుకు చేరిన దీక్షల సందర్భంగా మంగళవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, పది ప్రాజెక్టుల సిడిపిఒలు, సూపరింటెండెంట్లు యూనియన్ ప్రాజెక్ట్ నాయకులతో జాయింట్ సమావేశం చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు ప్రమోషన్లకు గానూ మూడు ప్రమోషన్లను వెంటనే అమలు చేయడానికి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని, మిగిలిన నాలుగు ప్రమోషన్లను త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. దీనికి జిల్లా కమిటీ అంగీకరిస్తూ ఒప్పందం జరిగిందని తెలిపారు. ఇది అంగన్వాడీల పోరాట విజయమని, భవిష్యత్తు పోరాటాలకు కదలి రావాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. మిగిలిన నాలుగు పోస్టులకు వెంటనే ప్రమోషన్లకు ఉత్తర్వులు జారీ చేయాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

5లోగా ఆవిష్కరణాత్మక ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టులకు ప్రతిపాదనలను ఈనెల 5లోగా నీతి ఆయోగ్‌కు సమర్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ (ఎడిపి), ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద నూతన ఆవిష్కరణాత్మక ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఈనెల 5లోగా నీతి ఆయోగ్‌కు పంపాలని అన్నారు. డ్వామా, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, పీడీలు, డిఇఒ, డిఎంహెచ్ఓ, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, సీతంపేట ఐటిడిఎ పిఒకు తమ విభాగాల వారీగా ఆవిష్కరణాత్మక ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా స్థాయి ప్రతిపాదనల సమన్వయం, పర్యవేక్షణ, సమయానికి సమర్పణ కోసం నోడల్ ఆఫీసర్‌గా మహేష్ ఉంటారని అన్నారు. సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యే నీతి ఫ్రంటియర్ టెక్ హబ్ రేపొజ్టోరీ ద్వారా ఆరోగ్య, విద్య, వ్యవసాయం, డిజిటల్ లెర్నింగ్ మరియు పబ్లిక్ సర్వీస్ డెలివరీ రంగాల్లో సాంకేతికత ఆధారిత పరిష్కారాలను విస్తృతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

ఆహార సామగ్రి సరఫరా టెండరు ఖరారు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులం రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆహార సామాగ్రి, సౌందర్య సాధనాల కొనుగోలుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఐటిడిఎ పిఒ ఆర్.వైశాలి సమక్షంలో బుధవారం గిరిమిత్ర హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా టెండర్లను తెరచి అతి తక్కువ ధరను ఖరారు చేశారు. టెండర్ ఖరారైన బిడ్డర్ మూడు మాసాల పాటు సరఫరా చేయాల్సి ఉంటుందని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, జిసిసి డిఎం, ఐటిడిఎ ఎఒ అధికారి, ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

జెసిగా యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ జిఒ విడుదల చేసింది. ఇందులో భాగంగా జెసిగా పనిచేస్తున్న ఎస్ఎస్ శోభికను ఐటిడిఎ పిఒగానూ, ఆమె స్థానంలో యశ్వంత్‌కుమార్‌రెడ్డిని జెసిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గతంలో ఈయన సీతంపేట ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒగానూ, పాలకొండ సబ్‌కలెక్టర్ పనిచేస్తూ ఇటీవలే బదిలీ అయ్యారు.

ఎండబ్ల్యుపిఎస్‌సి యాక్ట్ పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల పోషణ, సంక్షేమ చట్టం – 2007 (ఎండబ్ల్యుపిఎస్‌సి)ను పక్కాగా అమలుచేయాలని హెరిటేజ్ ఫౌండేషన్ న్యాయవాది రవికుమార్ జిల్లా అధికారులను కోరారు. చట్టాన్ని అమలు చేయాలంటే దానిపై పూర్తిగా అవగాహన ఉండాలని, అందుకోసమే ఈ కార్యక్రమమని తెలిపారు. ఎండబ్ల్యుపిఎస్‌సి-2007పై జిల్లా అధికారులతో ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్ఆర్‌టిసి, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాది రవికుమార్ ఎండబ్ల్యుపిఎస్‌సి చట్టం అమలు, చట్టాన్ని ఉల్లంఘిస్తే తీసుకోబోయే చర్యలపై అధికారులకు వివరించారు. సకావున జిల్లా అధికారులంతా తమ పరిధిలో వృద్ధులకు, తల్లిదండ్రులకు ఎటువంటి కష్టం కలగకుండా ఉండేందుకు సహకరించాలని, చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎల్.ఎన్.వి.శ్రీధరరావు, ఐఆర్‌సిఎస్ చైర్మన్ ఎం.శ్రీరామమూర్తి, కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షకులు, జిల్లా అధికారులు, అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో అన్ని గ్రామాలకు లింకు రోడ్లు త్వరలో పూర్తి చేయనున్నట్లు పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం సీతానగరంలో టిడిపి నాయకులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. అలాగే చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో సాగునీటి ప్రాజెక్టుల పనులకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. అలాగే మండలంలో అన్ని గ్రామాలకు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని, వర్షాకాలం తర్వాత కాంట్రాక్టర్లు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నామన్నారు. అనర్హుల పింఛన్లు మాత్రమే రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో గాడి తప్పిన రాష్ట్ర పాలనను గాడిన పెడుతున్నారని స్పష్టం

చిట్టిగెడ్డ ప్రవాహంతో దెబ్బతిన్న వంతెన

రెండు చోట్ల రంధ్రాలు
20 గ్రామాలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండ పుట్టి సమీపాన గల చిట్టిగెడ్డ వంతెన వరద ప్రవాహానికి దెబ్బతింది. దీంతో మక్కువ, సాలురు మండలాలకు చెందిన సుమారు 20 గ్రామాల గిరిజన ప్రజల రాకపోకల అంతరాయం ఏర్పడింది. తుఫాను కారణంగా వచ్చిన వరదలకు ఈ వంతెన రెండు చోట్ల రంధ్రాలు పడడంతో పాటు, రక్షణగా నిర్మించిన స్తంభాలు కూడా కొట్టుకుపోయాయి. మంగళవారం రాత్రి వచ్చిన వరదకు వంతెన దెబ్బతిందని ఆ ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని నంద, తుండ, మార్కొండపుట్టి పంచాయతీలకు చెందిన గిరిజనులు కోరుతున్నారు. పలుమార్లు శిథిలావస్థకు చేరిన వంతెన గురించి విజ్ఞప్తులు చేశామని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మాణం జరిగాలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



వరద ప్రవాహానికి దెబ్బతిన్న వంతెన

భవన నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని చాకలి బెలగాంలో రూ.80 లక్షలు ఎన్‌హెచ్‌ఎఫ్ నిధులతో చేపట్టిన అర్బన్ హెల్త్ సెంటర్ భవనంలో మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రారంభించాలని ప్రభుత్వ ఇంజనీరింగ్ చీఫ్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో బుధవారం కమిషనర్ చాంబర్లో మున్సిపల్ ఎఫ్ఎసి కమిషనర్ జి.శ్రీనివాసరాజు, పబ్లిక్ హెల్త్ డిఇ వంశీకృష్ణతో సమావేశమై, అర్బన్ హెల్త్ సెంటర్ భవనం పూర్తి చేసేందుకు రూ.13 లక్షలు అంచనాలతో రీ టెండర్ వేసి భవనం నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా హాస్పిటల్ శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్నటువంటి పిఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ అండ్ సూపర్వైజర్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంట్రాక్టర్ పిఎఫ్ బకాయిలు పెట్టి ఉన్నాడని దీనిపై పలుమార్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ద్వారా తెలియజేశామన్నారు. అలాగే జీతాలు రూ.16 వేలు చొప్పున చెల్లించాల్సి ఉన్నప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో టివిటి గ్రూపు యాజమాన్యంపై కేసులు వేశామన్నారు. త్వరలో రానున్న కొత్త కాంట్రాక్టర్ ద్వారా ఏదైతే ప్రభుత్వ నియమావలికి అనుగుణంగా జీతాలు చెల్లించాలని ప్రధాన డిమాండ్‌గా తెలియజేస్తామన్నారు. సమావేశంలో నాయకులు సింహాద్రి దుర్గారావు, ఇవి నాయుడు తదితరులు పాల్గొన్నారు

డి.శిర్లాం మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని దేవరశర్లం మాజీ సర్పంచ్ గేదెల జగన్నాథం (73) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. 2006 నుంచి 2019 వరకు రెండుసార్లు పంచాయతీ సర్పంచిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల ఎంపిపి మర్రి పారమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు మామిడి రంగునాయుడు, వివిధ పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు జగన్నాథం మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక వైటిసిలో ఉన్న స్కిల్ కాలేజీలో ఉచిత కంప్యూటర్, ఇంగ్లీష్ శిక్షణ, ప్లేస్మెంట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ కాలేజ్ కోఆర్డినేటర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైటిసి స్కిల్ కాలేజ్‌లో 4 నెలలు ఉచిత శిక్షణ ఉంటుంది. అలాగే ఉచిత భోజనం, వసతి సదుపాయం కూడా ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి కూడా లభిస్తుందన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన అభ్యర్థులంతా అర్హులేనన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12లోగా ధ్రువపత్రాలతో స్థానిక వైటిసికి హాజరు కావాలన్నారు.

రూరల్ సిఐగా రంగనాథం

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

పార్వతీపురం రూరల్ సిఐగా పి.రంగనాథం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ రంగనాథం మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అధికారుల సమన్వయంతో పనిచేస్తానన్నారు. అలాగే పట్టణ ఎస్సైగా పనిచేస్తున్న ఎం.గోవిందరావు డిసిఆర్‌బికి బదిలీ అవ్వగా, ఆయన స్థానంలో విఆర్ మన్యం డిసిఆర్‌బిలో విధులు నిర్వహిస్తున్న బి.సురేష్ బదిలీపై పట్టణ పోలీసు స్టేషన్ ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టనున్నారు.

మల్లేశ్వరరావుకు సన్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గుణద గ్రామానికి చెందిన జనసేన కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావును రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులుగా నియమించడం పట్ల బుధవారం కూటమి నాయకులు అభినందించారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పి చిరు సన్మానం చేశారు. ఎస్‌టి కమిషన్ సభ్యులుగా మంచి సేవలను గిరిజనులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, నియోజకవర్గ ఎస్టి సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, కొమరాడ జనసేన కన్వీనర్ తెంటు శ్రీకర్, గుమ్మలక్ష్మీపురం బిజెపి కన్వీనర్ కడ్రక అప్పలస్వామి, దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, నాయకులు సుదర్శన్ రావు, కొండలరావు, రామకష్ణ, వెంకట్రావు, చలపతిరావు, నాగేశ్వరరావు, కార్తీక్, జయరాజ్, వేణు కుమార్, కష్ణ, బుజ్జేశ్వరరావు, రామారావు, సుగ్రీవులు, జానకి, తదితరులు పాల్గొన్నారు.

'కిల్లాడ'లో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని కిల్లాడ పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూయక సరస్వతి మాట్లాడుతూ అర్హులైన వికలాంగులకు కూటమి ప్రభుత్వం పింఛన్లను తొలగించి వారికి అన్యాయం చేసిందన్నారు. సెప్టెంబర్ నెల వచ్చినా ఎరువులు అందలేదన్నారు. గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కిల్లరిక గన్నేమ్మ, వైసిపి పాలకొండ నియోజకవర్గం ఎస్‌టి కన్వీనర్ నిమ్మక కాంతారావు, దోనుబాయి సర్పంచ్ వెంకి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


రాయ్‌పూర్ ట్రైన్‌లో పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి - కొమరాడ

ఒడిస్సా నుంచి ఆంధ్రాలోకి ఎటువంటి మత్తు పదార్థాలు, గంజాయి వంటి అక్రమ రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎస్ఐ కె.నీలకంఠం అన్నారు. బుధవారం కూనేరు రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం వెళ్లే పాసింజర్ ట్రైన్‌లో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు జిఆర్‌పి పోలీసులు, ఆర్‌పిఎఫ్, ఎస్‌టిఎఫ్, ఈగల్ టీమ్ బృందాలతో ట్రైన్‌లో ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రైన్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశామన్నారు.

అఖండ అన్న సంతర్పణ

ప్రజాశక్తి - వీరఘట్టం



అన్నదానం చేస్తున్న సేవా సంఘం సభ్యులు

మండల కేంద్రమైన వీరఘట్టంలోని కూరాకుల వీధిల బుధవారం శ్రీ కృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా అఖండ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవంలో భాగంగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడంతో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయకుని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జామి అనురాధ-లక్ష్మీనారాయణ, జామి సింహాచలం, కర్రి నాగభూషణం, కోట త్రినాథ, బొద్దాన గణపతి, కర్రి పరసి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బిసి ప్రతినిధులు

పార్వతీపురం: రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులు రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు అధ్యక్షతన కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. బిసి విద్యార్థులకు వసతి గృహాలు, పాఠశాలలో మంచి మౌలిక వసతులు కల్పించాలని, ప్రత్యేక వసతి గృహాలు ఏర్పాటు చేయాలని, సివిల్ సర్వీసెస్ వంటి ఉన్నత పరీక్షలకు కోచింగ్‌లను ప్రారంభించాలని, జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు తదితర అంశాలతో సమర్పించారు. వీటిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ బీసీ సంక్షేమ సంఘం సమర్పించిన అంశాలను ఉన్నత అధికారులకు పంపిస్తామని, జిల్లా స్థాయిలో తమ పరిధిలో అవసరమగు చర్యలు చేపడుతామని అన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: పట్టణంలో గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని ఆ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. 33/11 కెవి సబ్ స్టేషన్‌లో 8 ఎంవిఎ పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏరెక్షన్ వర్క్ జరగుతుందని, దీనివల్ల పార్వతీపురం సబ్‌స్టేషన్ పరిధిలో గల బెలగాంలోని చర్చివీధి, బంగారమ్మ కాలనీ, బైపాస్ రోడ్, గోపాల్‌దాస్ పేట, పార్వతీపురం మెయిన్ రోడ్, సౌందర్య బ్యాక్ సైడ్, కలెక్టర్ ఆఫీస్ రోడ్డు, ఆర్టీసి కాంప్లెక్స్ రోడ్ నుంచి రాయగడ రోడ్, నారాయణ స్కూల్, కొత్తవలస తదితర ప్రాంతాలకు, మున్సిపాలిటీ మొత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు అంతరాయానికి సహకరించాలని తెలిపారు.

చలో విజయవాడకు కదలిరండి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి విద్యార్థులంతా కదలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ పిలుపునిచ్చారు. మండలంలోని ఉదయపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి బుధవారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు తీవ్ర ద్రోహాన్ని తలపెట్టిందని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించారని, తల్లికి వందనంలో అనేక షరతులు పెట్టి 60 వేలమంది తల్లులను దూరం చేసిందని తెలిపారు. నూతన విద్యా విధానంతో సరళమైన మార్పులు తీసుకొచ్చి విద్యారంగంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వమే కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని, ఇది రాజ్యాంగ నిబంధనలకే విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలను అణగదొక్కే జిఒలతో ప్రయత్నం మానుకోవాలని, ప్రతిపక్షంలో ఆ విద్యార్థుల వద్దకే నేటి విద్యాశాఖ మంత్రి వెళ్లి అధికారం కోసం వేడుకొన్నారని గుర్తు చేశారు. కావున, ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు అనుమతులు రద్దు చేసే ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జిఒ 77ను రద్దు చేసి పిజి విద్యార్థులందరికీ ఫీజురీయింబర్స్మెంట్ ఇవ్వాలని, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, పార్వతీపురంలో మెడికల్ కళాశాల నిర్మించాలని, కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు పూర్తి చేయాలని, హాస్టల్ విద్యార్థులకు రూ.3 వేలు మెస్ బిల్లులు పెంచాలని, హాస్టళ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, ఎయిడెడ్ జూ.కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులు, ఖాళీ విసి పోస్టులు భర్తీ చేయాలని, అర్హులైనవారందరికి తల్లికి వందనం పథకం రూ.15 వేలు అందించాలని, రాష్ట్రంలో విద్యార్థులందరికి ఉచిత బస్ పాస్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక విద్యార్థినులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - మక్కువ

పంటలకు ఆశిస్తున్న తెగుళ్లపై రైతులకు రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీనివాసరాజు, అమృతవీణ అవగాహన కల్పించారు. మండలంలోని మార్కొండ పుట్టిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం హెచ్ఒ ప్రత్యూష భాను అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానంగా అరటి పంటలో వచ్చే చీడపీడల నుంచి ఏ విధంగా రక్షించుకోవాలి, వాటిని అధిగమించడానికి తీసుకొనే చర్యలను శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రధానంగా ఆయిల్ ఫామ్‌లో ఎదురవుతున్న కొమ్ము పురుగు, మోవుకుళ్ళు సమస్యలను రైతులు శాస్త్రవేత్తలకు తెలిపారు. ఈ సమస్యలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణకు వాడాల్సిన మందులను, వాటిని వినియోగించే పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించారు. వ్యవసాయ, విద్య, ఉద్యా నవన పంటలను వేరువేరుగా చూడకూడదని, యూరియాను కూడా వేరువేరుగా ఇండెంట్ పెట్టుకోవాలని రైతుల అడిగిన ప్రశ్న లకు రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఉద్యానశాఖ అధికారిని ప్రత్యూషభాను సూచించారు. కార్యక్రమంలో స్థానిక వీ హెచ్ ఎ గణేష్, ఉద్యాన పంటల రైతులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని జోగింపేట, పాపంవలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి అవినాష్ మాట్లాడుతూ ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని పరిశోధన కేంద్రం నుండి చిరుసంచి ఎంటియు-1426" అనే కొత్త వరి రకాన్ని విడుదలైందన్నారు. ఈ రకం రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు వ్యాధి నిరోధకత కలిగి, ఎక్కువ దిగుబడిని ఇస్తుందన్నారు. ఈ రకం వరి పంటను 110 రోజుల్లో కోతకు సిద్ధం చేసుకోవచ్చన్నారు. మండలంలోని అన్ని రైతులు ఈ కొత్త రకాన్ని స్వీకరించి, అధిక దిగుబడులు పొందాలని కోరారు. కార్యక్రమంలో పాపంవలస సర్పంచ్ ఎం.గౌరినాయుడు, జోగింపేట, రైతులు పాల్గొన్నారు.



సాలూరు: డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎఒ శిరీష

డ్రోన్‌లతో మందులు పిచికారీతో మేలు

సాలూరు రూరల్: డ్రోన్‌లతో మందులను పిచికారీ చేస్తే ఖర్చులు తగ్గుతాయని వ్యవసాయ అధికారిని కె.శిరీష అన్నారు. మండలంలోని తోనాం పంచాయతీ పరిధిలో ముంగివానివలస, గుడ్డంగివానివలస గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూషభాను, రాస్త కుంటభాయి శాస్త్రవేత్తలు ఎ. శ్రీనివాసరాజు, అమృతవీనతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ శిరీష మాట్లాడుతూ వరి, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతలను పాటించాలని, రైతులు యూరియా మోతాదుకు మించి వినియోగించడం వల్ల పంట పురుగులు, తెగుళ్ల బెడదకు గురి అవుతాయని చెప్పారు. రైతులందరూ వ్యవసాయ సహాయకులని సంప్రదించి ఈ పంట తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. డ్రోన్ ద్వారా రసాయనిక మందులు పిచికారీ చేస్తే కలుగు లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దీక్ష వెల్ఫేర్ సిఇఒ శాంతి, రైతులు పాల్గొన్నారు.

పాచిపెంట: రైతులు ఒకే పంట వేసుకోవడం కంటే మొక్కల మధ్య ఖాళీ నేలలో అంతర పంటలు వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఎఒ తిరుపతిరావు అన్నారు. పత్తి, మొక్కజొన్న వంటి పంటలలో వరుసల మధ్య ఖాళీలు ఎక్కువగా ఉంటాయని ఈ ఖాళీలలో అపరాలు చోడి, వేరుశనగ వంటి పంటలను వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడమే కాకుండా కలుపు ఉధృతి తగ్గుతుందని, జీవ వైవిధ్యం పెరుగుతుందని తెలిపారు. కర్రివలసలో రైతులు లండ నారాయణరావు, లంక రమేష్, చిరంజీవి, దాసరి గోవింద వంటి పదిమంది రైతులు వేసిన అంతర పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. మొక్కజొన్న చుట్టూ ఒక వరుసలో గంటెలు, ఒక వరుసలో తెల్లజొన్న, పత్తి పంట మధ్యలో చోడి, గోంగూర, మినుములు, వేరుశనగ పంటలతో పాటుగా గట్ల మీద మునగ, ఆముదం, కంది, అరటి, బొప్పాయి వంటి పంటలను వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్నట్లుగా రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సేద్య ఎంటి యశోదమ్మ, సురేష్, పాల్గొన్నారు.

స్వమిత్వ, కౌశలం సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న స్వమిత్వ, కౌశలం సర్వే వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎస్ రమేష్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం చిన్నకేరిజల, రేగులపాడు గ్రామంలో స్వమిత్వ, కౌశలం సర్వేపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన కౌశలం సర్వేపై కొంతమంది విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి ఈ సర్వే ఉపయోగాలు తెలిపారు. ఈ సర్వేలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ డేటా ప్రకారం మండలంలో 2503 మంది వివిధ అర్హతలు పొంది నిరుద్యోగులుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో 1181 మంది వివరాలు నమోదు చేశామని ఇంకా 1300 మందికి నమోదు చేయవలసి ఉందని అన్నారు. గుణానపురం సచివాలయంలో 11 మందితో ఇంటరాక్ట్ అయి మిగిలిన వారితో సహకరించమని తెలిపారు. అనంతరం చోళ్ళ పథం, ఉలిపిరి, కొమరాడ గ్రామాల్లో పర్యటించి సర్వే వేగవంతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జంఝావతి పనులు త్వరగా చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జంఝావతి ప్రాజెక్టుపై ప్రకటనలు కాదు.. పనులు జరగాలని జంఝావతి సాధన సమితి ప్రతినిధులు వంగల దాలి నాయుడు, తీళ్ళ గౌరీ శంకరరావు, బలగ శంకరరావు కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా పాలకులు, అధికారులు జంఝావతి ప్రాజెక్టును ప్రకటనలకే పరిమితం చేస్తూ ప్రజలను, రైతులను మభ్యపెడుతున్నారన్నారు. జంఝావతి ప్రాజెక్ట్ పూర్తి కాకపోవటంతో ఈ ప్రాంతం వెనుకబడి ఉందన్నారు. ప్రాజెక్ట్ పూర్తికాక, వర్షాలు సకాలంలో కురవక, వ్యవసాయం లాభాదాయకంగా లేకపోవడంతో జంఝావతి ఆయకట్టు ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు పెద్దపెద్ద పట్టణాలు హైదరాబాద్, చెన్నై విజయవాడ, విశాఖ తదితర ప్రాంతాలకు వలసపోయి కూలీలుగా, వాచ్‌మెన్‌లుగా మారారనీ, వారంతా వ్యవసాయానికి దూరమయ్యారని అన్నారు.

హైటెన్షన్ తీగ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొమరాడ

హై టెన్షన్ విద్యుత్తు తీగ తగిలి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని అర్తాంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దోలు సుధా రామలక్ష్మి కుమారుడు రోహిత్‌కు హైటెన్షన్ విద్యుత్ తీగ తగిలి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం అర్తాం గ్రామ సమీపాన అంతర్ రాష్ట్ర రహదారి పక్కన ఉన్న బిల్డింగులపై హై టెన్షన్ విద్యుత్తు లైను ఉంది. ఆ భవనం కిందన రేషన్ తీసుకు నేందుకు తల్లితో వచ్చిన ముగ్గురు పిల్లలు పక్కన ఉన్న మెట్ల పైనుంచి మేడ పైకి వెళ్లి ఆడుకుంటున్నారు. వీరు మేడపైకి వెళ్లిన విషయం ఎవరికీ తెలియకపోవడంతో ఒకసారిగా పైనుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ వైర్‌ను రోహిత్ చేత్తో పట్టుకున్నాడు. దీంతో పక్కన ఉన్న ఇద్దరు చిన్న పిల్లలు కేకలు వేశారు. దీంతో విషయం తెలుసుకున్న స్థానికులు కర్ర సహాయంతో విద్యుత్ వైర్‌ను కొట్టి బాలుడ్ని రక్షించారు. ఈ ప్రమాదంలో రోహిత్ ఎడమ చేయి వేళ్లు పూర్తిగా కాలిపో యాయి. మెడ నుంచి కింద వీపు వైపు కాలిపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అనంతరం పార్వతీపురం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం తరలించారు. కుటు ంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివ రాలు ప్రకారం బాలుడి చేయిని పూర్తిగా తీసి ఇస్తేనే ప్రాణాలు దక్కుతాయని చెప్పడంతో కుటుంబం సభ్యుల్లో భయాం దోళన నెలకొంది. హై టెన్షన్ విద్యుత్ తీగల కింద ప్రైవేటు బిల్డింగు ఎలా నిర్మిస్తారని గ్రామంలో ఉన్న పలువురు విద్యుత్ శాఖ అధికారులు తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఎఇ వెంకట రమణను వివరణ కోరగా హైటెన్షన్ విద్యుత్ తీగల కింద భవనం నిర్మించ కూడదని సంబంధిత యజమానికి చెప్పినప్పటికీ నిర్లక్ష్యంగా నిర్మాణాలు చేపటినట్లు తెలిపారు. అప్పటికే అతనికి నోటీసులు ఇచ్చి బిల్డింగును తొలగిం చాలని, లేదా హై టెన్షన్ విద్యుత్ లైన్లు మార్పుకు ప్రభుత్వానికి చలానాల కట్టా లని ఆదేశించినా అతను పట్టించుకో లేదని చెప్పారు.



నేరాలు ఘోరాలు

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కురుపాం ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం జియ్యమవలస మండలంలో గల కన్నపుదొరవలస గ్రామంలో జరిపిన దాడుల్లో చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ మురళి అనే వ్యక్తి నాటుసార అమ్ముతుండగా పట్టుకొని 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు. పాత కేసులో ముద్దాయి అయిన గుమలక్ష్మీపురం మండలం సవర కోటపాడుకు చెందిన బిడ్డిక కృష్ణను అరెస్టు చేసి వీరిద్దరిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఎవరైనా నాటుసారా మద్యం అమ్మినా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- పాచిపెంట

మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని పాచిపెంటలో టిడిపి మండల అధ్యక్షులు గూడెపు యుగంధర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పార్టీ కార్యాలయంలో తెలపవచ్చన్నారు. వచ్చిన ఫిర్యాదులు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మతల బలరాం, సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ పోసర్ల నర్సింగరావు, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు నడిపల్లి మెహర్ బాబా, పెద్ద గెడ్డ చైర్మన్ గుండ్రతు గంగరాజు, పార్టీ ఉపాధ్యక్షులు కొత్తల పోలినాయుడు, కొరిపిల్లి సురేష్, మండల యూత్ అధ్యక్షులు చల్లా కనకబాబు, త్రీమెన్ కమిటీ చైర్మన్ మాదిరెడ్డి మజ్జారావు, పాచిపెంట ఉప సర్పంచ్ పల్లెడ వెంకటరమణ, పెద్దవలస సర్పంచ్ లావుడిజన్ని కుమారి, మంచాడవలస సర్పంచ్ చీమల సావిత్రి, టిడిపి నాయకులు మంచాల పారమ్మ, ఆకుల శ్రీను రాకోటి పాపారావు తదితరులు పాల్గొన్నారు

చింతాడకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని పెద్దభోగి పంచాయితీ మాజీ ఉపసర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు చింతాడ సత్యనారాయణను స్థానిక ఎమ్మెల్యే బోనుల విజయ్ చంద్ర పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణకు గుండె ఆపరేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు పెంట సత్యనారాయణ, రౌతు వేణుగోపాల నాయుడు, పార్టీ నాయకులు ఎస్.హరిగోపాల రావు, బి.శ్రీనివాసరావు, సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్, మాజీ ఎంపిటిసి ఎస్ శ్రీనివాసరావు, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు తో పాటు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

ఎగువున కురుస్తున్న వర్షాలు కారణంగా వేగావతి నదిలో బురద నీరు వస్తున్న సందర్భంగా మున్సిపాల్టీకి మంచినీటి సరఫరాను గురువారం నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ తెలిపారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలంతా గమనించి ముందుగానే మంచినీటిని తెచ్చి ఉంచుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

కస్పా వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం సచివాలయం-2 పరిధి గల కస్పావీధిలో బుధవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, రక్తపోటు, మధుమేహ, జ్వర పీడితులు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపించేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీలకంఠాపురంలో ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: మండలంలోని కె.వెంకటాపురం పంచాయతీ పరిధిలో గల నీలకంఠాపురంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.రమ్యసాయి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచి నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. ఈ ఉచిత శిబిరంలో 30 మందికి తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ ఈ.సూర్యనారాయణ వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు ఎస్ఎస్ఎస్ టీకాలు వేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని అన్ని ఇన్స్టిట్యూషన్‌లో పశువులకు లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్)ను అమలు చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ మన్మధరావు సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో గల పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని లింగ నిర్ధారిత వీర్యం ధరను రూ.500 నుంచి రూ.150 రూపాయలకు తగ్గించినట్టు తెలిపారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దీని ద్వారా 90 శాతం ఖచ్చితత్వంతో ఆడ దూడలు పుట్టే అవకాశం ఉందన్నారు. ఈనెల 15నుంచి చేపట్టబోయే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం చేపట్టాలని కోరారు. పశుసంవర్ధక శాఖలో చేపట్టిన అన్ని కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు పశువైద్య సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ దీనకుమార్, డాక్టర్ మాణిక్యరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ బి శ్రీనివాస్, డాక్టర్ శ్రీ సంధ్య , వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ డాక్టర్ చక్రధర్, డాక్టర్ ఆర్.జి . జె.శంకర్రావు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు బుధవారం నియోజకవర్గ హిజ్రాల అధ్యక్షులు ఎ.గీతారాణి హెచ్ఐవి - ఎయిడ్స్, సుఖ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్ సోకే విధానం హెచ్ఐవి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు సలహాలు అందించారు. హెచ్ఐవి సోకినవారిపట్ల ఎవరూ వివక్షత చూపకూడదని, అలా చూపినట్లయితే 2017 చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి శిక్షణ తరగతులు పరిశీలన


ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతున్న ఆది కర్మయోగి అభియాన్ శిక్షణా తరగతులను పార్వతీపురం ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన గ్రామాలలో విలేజ్ మిషన్ ప్లానింగ్, మ్యాపింగ్ ఎక్సర్‌సైజ్ చేయాలన్నారు. ఫస్ట్ ఫేజ్‌లో 500 జనాభాకు మించిన గ్రామాలలో ఈ కార్యక్రమాలు మొదలు పెట్టాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- సీతానగరం

రాష్ట్రంలో భవన నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులందరి సమస్యలూ పరిష్కారం చేయాలని ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు గవర వెంకటరమణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాయిపల్లి రాము డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, నేటి వరకు పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్లయిమ్‌లు కార్మికులకు అందలేదని చెప్పారు. వివిధ సందర్భాల్లో వసూలు చేసిన సెస్ నిధులను సంక్షేమ బోర్డు ద్వారా నిర్మాణ కార్మికులకే ఖర్చు చేయాలని, ఇది వరకు వెల్ఫేర్ బోర్డు నుండి తీసుకున్న నిధులు వెంటనే తిరిగి ఇవ్వాలని, భవన నిర్మాణ కార్మిక పిల్లలకు స్కాలర్‌షిప్స్ ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో నిర్మాణ రంగ కార్మికుల అమలు చేస్తున్న భద్రతను రాష్ట్రంలో కూడా అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధనకై ఈ నెల 8వ తేదీన పార్వతీపురంలో జరుగునున్న జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శనపతి కృష్ణ, తోలాపు రమేష్, సారిక గోపి, ఆర్.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పక్కాగా యాక్షన్ ప్లాన్ : పిఒ

ప్రజాశక్తి- సీతంపేట

విలేజీ యాక్షన్ ప్లాన్ పక్కాగా తయారు చేయాలని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ అన్నారు. ఆది కర్మయోగి జిల్లా ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం 13 మండలాల ఎంపిడిఒలు, పంచాయతీ సెక్రెటరీలు, జిల్లా రిసోర్స్ పర్సన్స్, ఐటిడిఎ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి గ్రామస్థాయి ఆది కర్మయోగి కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని కోరారు. ఈ ఐదు రోజులు మండల అధికారులు స్థానిక అధికారులు అందరూ సమన్వయంతో గ్రామంలో ఉన్న సమస్యల్ని గ్రామంలో ఉన్న వనరుల్ని గ్రామంలో ఉన్న అందరి అభిప్రాయం తీసుకుని యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఏ సమస్య ఉన్న తక్షణమే ఐటిడిఎకు తెలియజేస్తే తక్షణ పరిష్కారం చేస్తామని చెప్పారు. 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆది కర్మయోగి గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్‌లోనే అందరూ నిమగ్నమై ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఒ చిన్నబాబు, డిడి అన్నదొర, ఎఎంఒ కోటిబాబు, ఎంపిడిఒలు, డిపిఒ సతీష్, ఎన్‌జిఒ ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, ఎఒ సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్